క్లుప్తంగా

నేడు ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


బయ్యనగూడెంలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మ తల్లి

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో కొలువుదీరి ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ శంకుస్థాపన పూజలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఉపసర్పంచ్ కోరుకొండ లలిత తెలిపారు. జాతీయ ప్రధాన రహదారికి ఆనుకుని రామకోనేరు చెరువు గట్టుపై ఉన్న అమ్మవారి ప్రస్తుత ఆలయాన్ని పునర్నిర్మించి ఉత్సవాలు చేయడానికి గ్రామస్తులు సంకల్పించారని అన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఆలయ శంకుస్థాపన పూజలు పరమశ్రీ అనిపెద్ది వెంకట నరసింహ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

నూర్ బాషా సంఘ జిల్లా కార్యదర్శిగా మస్తాన్


షేక్ మస్తాన్

కొయ్యలగూడెం: నూర్ బాషా(దూదేకుల) ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినట్లు షేక్ మస్తాన్ వల్లి ఆదివారం పేర్కొన్నారు. రాజవరం గ్రామానికి చెందిన మస్తాన్ వల్లి వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ విభాగం నాయకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర నూర్ భాష మైనార్టీ సెల్ అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న ఎస్ఎస్ బాజీ తనకు నియామక పత్రాన్ని అందజేశారని తెలిపారు. దూదేకుల సంఘ పటిష్టతకు, ప్రభుత్వం తరపున సంఘ సభ్యులకు చేకూరే సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేస్తానని మస్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు మస్తాన్‌ని అభినందించారు.

జగనన్న కాలనీలో విద్యుత్ వెలుగులు


విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

టి.నరసాపురం: మధ్యాహ్నపువారిగూడెం జగనన్న కాలనీకి విద్యుత్ సదుపాయం కల్పించారు. జగనన్న లేఅవుట్ కాలనీల్లో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పిస్తోంది. దీనిలో భాగంగా మధ్యాహ్నపువారిగూడెం జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతోపాటు వీధిలైట్ల స్తంభాలు నిర్మించి వీధి దీపాలు సైతం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పనులు పూర్తిచేశారు. దీంతో కాలనీలో విద్యుత్ వెలుగులు వెదజల్లుతున్నాయి.కాలనీలో విద్యుత్ సరఫరా పనులు పూర్తయినట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు ఆదివారం ప్రకటించడంతో లబ్ధిదారులు హర్షం ప్రకటించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: రాట్నాలకుంటలో వేంచేసిన మహిమ గల తల్లి రాట్నాలమ్మను ఆదివారం జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొన్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల ద్వారా రూ.19,970, విరాళాలు రూ.8,286, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.18,485, ఫొటోల విక్రయం ద్వారా రూ.1,995, మొత్తం రూ.48,686 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఏలూరు టౌన్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, నేరగాళ్లపై గట్టి నిఘా ఉంచామని ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ తెలిపారు. ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి ఆధ్వర్యాన సిబ్బందితో కలిసి స్థానిక ద్వారకానగర్ 8వ రోడ్డులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి దాడి చేశారు. అజీజ్ అనే వ్యక్తి ఇంట్లో పేకాటాడుతున్న 7గురిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరి నుంచి రూ.24 వేలు నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

రామకోటి ప్రాంగణంలో నేత్ర వైద్య శిబిరం

ఏలూరు (టూటౌన్): స్థానిక ఒకటో పట్టణంలోని రామకోటి ప్రాంగణంలో డాక్టర్ మునగా రామమోహన్‌రావు కళావేదికపై ఎంజేఎఫ్ లయన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యాన ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వేమగిరి ఆస్పత్రి వైద్య సిబ్బంది శిబిరంలో 153 మందికి పరీక్షలు చేయగా 15 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరో 32 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఉషా సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పండరీనాథ్, చెన్నా వెంకట రామయ్య, బొరెశెట్టి సురేష్ కుమార్, ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

శక్తిస్వరూపిణీ.. నమోస్తుతే


ద్వారకాతిరుమల: శ్రీ బాలాత్రిపుర సుందరీ అలంకారంలో వాసవీ మాత


లింగపాలెం: ధర్మాజీగూడెంలో విశేష అలంకరణలో కనకదుర్గమ్మ


కొయ్యలగూడెం: ప్రత్యేక అలంకరణతో గ్రామదేవత శ్రీచింతాలమ్మ


కొయ్యలగూడెం: కన్నాపురంలో విశేష అలంకరణలో శ్రీవిజయలక్ష్మి కనకదుర్గమ్మ


కుక్కునూరు: గణేష్ నగర్‌లో బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు



ద్వారకాతిరుమల: లక్ష్మీపురంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న శ్రీవారి దేవస్థానం ఈఓ, బుట్టాయగూడెం: మర్లగూడెంలో పాటెమ్మతల్లికి పూజలు


జీలుగుమిల్లి: జగదాంబకు పూజలు చేస్తున్న ఎంపీపీ పోచమ్మ, తదితరులు

శ్రీబాలాత్రిపుర సుందరిగా కుంకుళ్లమ్మ తల్లి

ద్వారకాతిరుమల: శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు, అలాగే వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. జపమాలను పట్టుకుని దర్శనమిచ్చే ఈ తల్లిని బ్రహ్మచారిణిగా ఆరాధిస్తారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం రోజు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

లింగపాలెం: మండలంలో ఆదివారం నుంచి దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ధర్మాజీగూడెంలో వేంచేసిన శ్రీకనకదుర్గమ్మకు బాలా త్రిపుర సుందరి దేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిపారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేకమైన అలంకరణ జరుగుతుందని కమిటీ సభ్యురాలు పామర్తి కనకదుర్గమ్మ తెలిపారు. శివాలయంలో అర్చకులు అయిలూరి ఈశ్వరప్రసాద్ శర్మ కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ద్వారకాతిరుమల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక ఆళ్వార్ సదనం ఎదురుగా ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలోను, అలాగే తూర్పు వీధిలోని గంగానమ్మ ఆలయంలో కమిటీ సభ్యులు దుర్గమ్మవార్లకు విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీపురం ఆలయం వద్ద ఉన్న దుర్గాదేవి విగ్రహాలకు శ్రీవారి దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాధరావు దంపతులు, అలాగే ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అమ్మవార్ల విగ్రహాలను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి రాజరాజేశ్వరి, గంగానమ్మ అమ్మవార్ల ఆలయాల వద్ద నెలకొల్పారు. అనంతరం పూజాధికాలను జరిపారు. అదేవిధంగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద దుర్గాదేవి ఉత్సవ విగ్రహానికి పురోహితులు విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. మండలంలోని దొరసానిపాడు, వేంపాడు, తిరుమలంపాలెం తదితర గ్రామాల్లో ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

కొయ్యలగూడెం: శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి మండల వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. కొయ్యలగూడెం శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ, కన్నాపురం శ్రీ విజయలక్ష్మీ కనకదుర్గమ్మలు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలతో పూజలు అందుకున్నారు. శైలపుత్రి దేవి అలంకరణతో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. బయ్యనగూడెంలో శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ గజలక్ష్మీ దేవి అలంకరణతో పూజలందుకుంది. వికాస తరంగిణీ బయ్యనగూడెం వారిచే తొమ్మిది రోజుల పాటు లలితా సహస్రనామ పారాయణ నిర్వహించనున్నట్లు ధర్మకర్త తోరం సుబ్బారావు తెలిపారు. అమ్మవార్ల ఆలయాల వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కన్నాపురం రోడ్ లోని కనకదుర్గమ్మ గుడి వద్ద అర్చకులు మామిళ్ళపల్లి సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఎర్రంపేట, రాజవరం గ్రామాల్లో ప్రత్యేకంగా దసరా పురస్కరించుకుని అమ్మవార్ల విగ్రహాలను నెలకొల్పారు.

కుక్కునూరు: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని బాలాత్రిపుర సుందరి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గణేష్ నగర్‌లో ఏర్పాటు చేసిన మండపానికి అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం ఉదయం మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. శరన్నవరాత్రులు సందర్భంగా మహిళలు భవాని దీక్షలను చేపట్టారు. మండలంలోని సాయిబాబా ఆలయం, కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, అమరవరం రాజరాజేశ్వరి ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. తొమ్మిదిరోజుల పాటు అమ్మవారిని వివిధ అవతారాలలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.

బుట్టాయగూడెం: ఏజెన్సీప్రాంతంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవార్లకు నూతన వస్త్రాల అలంకరణ, పుష్పాలంకరణ, శ్రీచక్రార్చన, లలితా సహస్రనామ కుంకుమ పూజ, తదితర పూజలు చేశారు. మండలంలోని రెడ్డిగణపవరంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారు, ప్రత్యేక పందిర్లలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వమించారు. అలాగే కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో జీలుగుమిల్లి మండలానికి చెందిన సుమారు 150 మంది భక్తులు భవానీ మాలను ధరించారు. మర్లగూడెం అటవీప్రాంతంలో కొలువై ఉన్న పాటెమ్మ తల్లి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో పూజలు అందుకున్నారు. అలాగే అక్కడే కొలువై ఉన్న పసుపులమ్మ తల్లి అమ్మవారికి కూడా భక్తులు విశేషపూజలు చేశారు. అదేవిధంగా స్థానిక త్రిశక్తిపీఠంలో కొలువైన అమ్మవార్లు బాలాత్రిపురసుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

జీలుగుమిల్లిలో...

జీలుగుమిల్లిలోని జగదాంబ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంపీపీ కోర్సా పోచమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ ఛాత్రాతి భవానీ శేఖర్, కొప్పుల సత్యనారాయణ, కక్కిరాల చక్రధరరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం


నూకాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు



బాలా త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిస్తున్న గంగానమ్మ తల్లి, వాసవీ మాత


గంగానమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ దేవత గంగానమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవ మూర్తులతో కలశాలు ధరించి 200 మంది మహిళలు అమ్మవారిని మేళతాళాలతో పల్లకీలో ఊరేగించారు. డీకేడీ సత్యనారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు కలశస్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. శ్రీబాల త్రిపుర సుందరీదేవిగా గంగానమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. కేశనపల్లి రంగారావు, రత్నకుమరి, సత్య ప్రభాకర్ ప్రసాద వితరణ చేశారు.

- స్థానిక నూకాలమ్మవారు స్వర్ణ కవచాలకృంత నూకాంబిక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు యర్రమిల్లి మనోజ్ఞ శర్మ బంగారపు సూర్యనారయణ, శివలక్ష్మి, కారింగుల రామకృష్ణ, నాగరత్నం దంపతులు కలశస్థాపన నిర్వహించారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.
- స్థానిక ముత్యాలమ్మ తల్లి తొలిరోజు స్వర్ణవర్ణ కవచంతో దర్శనమిచ్చారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ పద్మకుమారి దంపతులు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. మండవల్లి రాంబాబు లక్ష్మీదుర్గ దంపతులు ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.
- స్థానిక వాసవీమాత ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దారా రవీంద్ర దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ కర్పూరం నారాయణరావు, మహంకాళి రాంబాబు, మహంకాళి రంగ ప్రసాద్, వందనపు వెంకటేశ్వరరావు, తారకం తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- స్థానిక పాత ఆంధ్రా బ్యాంక్ వీధిలో కొలువైన విజయదుర్గమ్మ, హైస్కూల్ వద్ద కొలువైన కనకదుర్గమ్మ తల్లి బాలా త్రిపుర సుందరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

జగన్ పాలనలో పేదల ఆర్థికాభివృద్ధి

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- కలరాయనగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పేర్కొన్నారు. లింగపాలెం మండలం కలరాయనగూడెంలో ఆదివారం జరిగిన 193వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. స్థానికులు విద్యుత్, డ్రెయినేజీలు, రోడ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. దాదాపు ప్రతి ఇంట్లో ఏదో ఒక పథకం రూపంలో ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే.. పార్టీలో సముచిత స్థానం


వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు చిటికెల అచ్చిరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు దక్కుతుందని దానిలో భాగంగానే అచ్చిరాజుకు పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా పదవి దక్కిందని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కమిటీ అధ్యక్షుడు చిటికెల అచ్చుత రామయ్య (అచ్చిరాజు)కు అభినందన సభ, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఎం చంద్రరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అలాగే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని, అందరూ ఒక్కతాటిపై పయనించాలన్నారు. తన సహాయ సహకారాలు పూర్తిగా అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అచ్చిరాజు మాట్లాడుతూ అందరినీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, తనను గుర్తించి పదవి కట్టబెట్టినందుకు పార్టీ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అచ్చిరాజును పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ పామర్రు నియోజకవర్గ పరిశీలకుడు మండవల్లి సోంబాబు, ఉభయ గోదావరి జిల్లాల బూత్ కమిటీ కోఆర్డినేటర్ బీఆర్ చౌదరి, మేడవరపు విద్యాసాగర్, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, ముప్పిడి అంజి, కంచర్ల వాసవిరత్నం, చింతా అనిల్‌కుమార్ గౌడ్, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు రామిశెట్టి హరిబాబు, బత్తిన చిన్నా, కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కలాం జయంతి


కొయ్యలగూడెం గ్రంథాలయంలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహిస్తున్న దృశ్యం


టి.నరసాపురంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన దృశ్యం

కొయ్యలగూడెం: భారతరత్న అబ్దుల్ కలాం 92వ జయంతిని స్థానిక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి చిన్నారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిస్సైల్ మేన్‌గా కలం ప్రపంచ ఖ్యాతిగాంచి భారతీయులకు గర్వకారణంగా నిలిచారని వక్తలు పేర్కొన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనేది కలాంనీ చూసి నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు కలాం చిత్రపటాలను స్వయంగా గీసి ప్రదర్శించారు.

టి.నరసాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం అబ్దుల్ కలాం 92వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ ఆర్ కిషోర్, విజన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు కలిసి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1997–1998 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులంతా కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆట పాటలతో సరదాగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను వారు ఘనంగా సత్కరించారు. తామంతా కలసి చదువుకుని 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకగా ఈ అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పులపా ఆనంద్‌కుమార్, షేక్ ఇస్మాయిల్, కాకి సురేష్, గ్రీష్మ, భాషా, రామారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ఆర్ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాడువాయికి చెందిన కాకుల్ల శ్రీను (49) గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యాన్ని తట్టుకోలేక ఈనెల 13న కలుపుమందు సేవించడంతో అతన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కొరకు ఏలూరుకు తరలించారు. శ్రీను చికిత్స పొందుతూ 14వ తేదీ రాత్రి మృతి చెందగా, దీనిపై అతని కుమారుడు మంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఆఫీసర్స్ అసోసియేషన్‌కు సహకారం అందిస్తా : ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఆఫీసర్స్ అసోసియేషన్‌కు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. ఆదివారం అసోసియేషన్ భవనాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏడీఏ పీవీ బుచ్చిబాబు, అసోసియేషన్ వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి అసోసియేషన్‌ను యాక్టివేట్ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఒకరికొకరు ఆయా శాఖలతో సంబంధాలు ఏర్పచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిన చిన్నా, రామిశెట్టి హరిబాబు, వర్ధనపు వెంకటేశ్వరరావు, ప్రసాద్, శ్రీను, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రవాణాకు కొత్త టెండర్లు పిలవాలి

లింగపాలెం: ఆయిల్‌పామ్ గెలలను ఫ్యాక్టరీకి చేరవేసేందుకు రవాణాకుగాను వెంటనే కొత్త టెండర్లు పిలవాలని రైతులు, వే్రబిడ్జి యజమానులు కోరారు. దీనిపై వారు ఆదివారం ధర్మాజీగూడెంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీవారు టెండర్ పిలిచి పాడిన వ్యక్తి ద్వారా పంటను తోలటం జరుగుతుందని తెలిపారు. ఈ పామాయిల్ ఫ్యాక్టరీ పరిధిలో మూడు మండలాలకు చెందిన ఆయిల్‌పామ్ రైతులు ఏటా పంటను విక్రయిస్తున్నట్లు చెప్పారు. రెండేళ్లకు ఒకసారి ఈటెండర్లు పిలవాల్సి ఉందన్నారు. ప్రస్తుతం టెండర్లు గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా కాంట్రాక్టర్‌కు మళ్లీ గడువు పొడిగించారని రైతులు, యజయానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత టెండర్లకు సంబంధించి ఫ్యాక్టరీవారు మూడు మండలాల్లో 10 పాయింట్లకుగాను ఒకే వ్యక్తికి గుత్తాధిపత్యంగా ఇవ్వటం జరిగిందన్నారు. ఈ టెండర్‌ను దూరప్రాంతంలో ఉన్న ఓవ్యాపారవేత్త వారి అనుమాయులు పేర్ల మీద నిర్వహిస్తున్నారని, ఈ విషయాన్ని ఇటీవల ముడిచెర్లలో ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. దీనిపై ఆయన అధికారులను మందలించి ఇకమీదట అలా జరగకుండా చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. టెండర్లు గడువు ముగుస్తుండటంతో లోపాయికారి ఒప్పందంతో ప్రస్తుత కాంట్రాక్టర్‌కే మళ్లీ గడువు పొడిగించడంచారని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే కొత్త టెండర్లు పిలవాలని రైతులు, వే్రబిడ్జి యజమానులు కోరుతున్నారు.